క్లుప్తంగా

కోలాహలం.. నిమజ్జనం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం టాప్‌లైన్‌లో బుధవారం సాయంత్రం గుండాలమ్మ నిమజ్జనాన్ని అట్టహాసంగా నిర్వహించారు. విశేష పూజలు చేసి అమ్మవారిని స్థానిక వీధుల్లో డప్పు వాయిద్యాల హోరు నడుమ ఊరేగించారు. అమ్మవారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓ-1గా వాసుదేవన్



పూతలపట్టు: పూతలపట్టు మండల విద్యాశాఖాధికారి-1గా వాసుదేవన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓ-2 మధుసూదన్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందలు తెలిపారు. ఎంఈఓ-1గా పనిచేసిన కృష్ణారెడ్డి గత మే నెలలో ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో సోమాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న వాసుదేవన్‌ను జిల్లా విద్యాశాఖ బుధవారం పూతలపట్టు ఎంఈఓ-1గా ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు వాసుదేవన్‌ను దుశ్శాలువతో స్వాగతం పలికారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

యాదమరి(పూతలపట్టు): డయేరియా రాకుండా మండలంలోని కీనాటంపల్లి గ్రామస్తులకు సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డయేరియా బారిన ప్రజలు పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. వర్షాకాలంలో నీళ్లు కలుషితమవడంతో దోమలు పెరిగి వాటి వల్ల డయేరియా సోకుతుందన్నారు. మండలంలో ఒక డయేరియా కేసు కూడా నమోదు కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సీహెచ్‌ఓ సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ దిల్షాద్, మహిళా ఆరోగ్య కార్యకర్త అమ్ములు, ఆశా కార్యకర్త అంజలి, నర్సింగ్ ట్రైనింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

• ఫ్యామిలీ డాక్టర్



గుడిపాల: గర్భిణులు సకాలంలో వైద్యసేవలు పొందాలని గుడిపాల ప్రాథమిక ఆరోగ్యాధికారి చంద్రమహేష్ కోరారు. బుధవారం కట్టకిందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల వ్యాధులకు సంబంధించి 55మందికి చికిత్స చేసి మాత్రలను అందజేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కోమల, చంద్ర, రోస్లిన్, పంకజ, నిత్య పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు కైవసం



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సత్యనారాయణ

చిత్తూరు కలెక్టరేట్: తమ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ఫలితాలు కైవసం చేసుకున్నారని శ్రీవివేకానంద(పీఎస్‌ఎన్) కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం నగరంలోని మురుగానపల్లెలోని శ్రీ వివేకానంద(పీఎస్‌ఎన్) కళాశాల వద్ద విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను నిఖిత, ప్రశాంతి, సాహితి 466, దిలీప్ కుమార్, ఐశ్వర్య, స్నేహ, వాసవి, ఉషశ్రీ, గణేష్, అక్షిత, భావన, లిఖిత, మహాలక్ష్మి 465 మార్కులు, లిఖిత, లాస్య, హాసిని, రిషిమైరెడ్డి, మన్యతరెడ్డి, పద్మశ్రీ, వేణిషా, చర్విత, వినిత్ 464 మార్కులు సాధించారన్నారు. అలాగే 466 మార్కులు ముగ్గురు, పది మందికి 465, తొమ్మిది మందికి 464, 12 మందికి 463, ఏడుగురు 462 మార్కులు సాధించి విజయఢంకా మోగించారన్నారు. ప్రిన్సిపల్ నాగరాజశెట్టి, అధ్యాపకులు పాల్గొన్నారు.


ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీఎంకే కళాశాల నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని మురుగానపల్లెలోని శ్రీ వివేకానంద (వీఎంకే) కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారని ఆ కళాశాల కరస్పాండెంట్లు మహేంద్ర, భాస్కరనాయుడు తెలిపారు. ఎంపీసీ విద్యార్థులు భావన 470 కి 465, దిశా హరిణి 465, కావ్య 464, హేమేశ్వర్, లక్ష్య 463, స్వాతి, బాలు, చక్రదీప్‌రెడ్డి, మోహిత్ 462 మార్కులు సాధించినట్లు వివరించారు. తమ కళాశాలలో ఎంపీసీ చదువుతున్న విద్యార్థులు 450 లోపు మార్కులు 50 మంది ఉత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించింది.

అయ్యోర్లు.. టార్గెట్



- ప్రైవేట్ టీచర్లపై యాజమాన్యాలు ఒత్తిడి
- విద్యార్థులను చేర్పించకపోతే ఉద్యోగం లేనట్టే
- బడులు ప్రారంభమైనా ఆగని ఒత్తిళ్లు
- విద్యాశాఖ అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే

చిత్తూరు కలెక్టరేట్: నియోజకవర్గంలోని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న టీచర్ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఆయా యాజమాన్యాలు విద్యార్థుల అడ్మిషన్లు చేయాలని టార్గెట్లు నిర్దేశించాయి. 2024–25 విద్యాసంవత్సరం ప్రారంభమై 13 రోజులు పూర్తవుతోంది. సెలవుల్లో మొత్తం టార్గెట్లు విధించి వేధించిన యాజమాన్యాలు ఇప్పుడు కూడా అలానే చేస్తున్నారని టీచర్లు ఆందోళన చెందుతున్నారు. అడ్మిషన్ల టార్గెట్ పూర్తి చేయాల్సిందేనని ఒత్తిడి చేస్తుండడంతో కొత్తగా విద్యార్థులను చేర్పించలేక, ఉద్యోగాన్ని వదులుకోలేక అవస్థలు పడుతున్నారు. ఓవైపు విద్యాబోధన, మరోవైపు టార్గెట్ల ధాటికి కార్పొరేట్ విద్యాసంస్థల టీచర్లు సతమతమవుతున్నారు. అసలే ఇచ్చేది అరకొర జీతాలని, ఈ టార్గెట్లు తలకు మించిన భారంగా మారాయని వాపోతున్నారు.

వేసవి సెలవుల్లోనూ..!

వేసవి సెలవుల్లో టీచర్లు, విద్యార్థులు సేదతీరడం పరిపాటి. అయితే ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు తమ సిబ్బంది, ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో కూడా విద్యార్థులను చేర్పించే పని అప్పగించారు. విద్యార్థులను చేర్పించినందుకు ఉపాధ్యాయులకు కొంత నగదు ఇస్తున్నా వారికి విధిస్తున్న టార్గెట్లను పూర్తిచేయడానికి పడరాని పాట్లు పడుతున్నారు. మండు టెండల్లో ఊరూరా తిరిగి పిల్లలను చేర్పించేందుకు శ్రమిస్తున్నారు.

చెబితే చేయాల్సిందే..

చిత్తూరు నియోజకవర్గంలో దాదాపు 216 ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఉండగా వాటిలో సుమారు 1.15 లక్షల మంది చదువుతున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో దాదాపు 12 వేల మందికి పైగా ఉపాధ్యాయులు, సిబ్బంది పనిచేస్తున్నట్లు అంచనా. స్కూళ్ల నిర్వహణ ఖర్చులు పెరిగాయని, దానికి తగ్గట్లు విద్యార్థుల సంఖ్య పెరగకుంటే జీతాలు చెల్లించడం కష్టమని చెప్పి సిబ్బందిని బెదిరిస్తున్నట్లు వాపోతున్నారు. యాజమాన్యం చెబితే చేయాల్సిందే. ప్రైవేటు స్కూళ్లలో ఉపాధ్యాయులు, సిబ్బంది స్కూల్ యాజమాన్యాలు ఏ పని చెబితే అది చేయాల్సిందే. లేదంటే ఉద్యోగం ఊడిపోతుంది. గతంలో విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక విభాగం అంటూ ఉండేది. ప్రస్తుతం దానిని తొలగించి మొత్తం పని ఉపాధ్యాయులతోనే చేయిస్తున్నారు. 6 నుంచి పదవ తరగతి వరకు అదనపు క్లాసులు ఏర్పాటు చేస్తూ ఉపాధ్యాయులపై మరింత ఒత్తిడి పెంచుతున్నారు.

విద్యాశాఖ తనిఖీల్లేవ్!

ప్రైవేటు విద్యాసంస్థల్లోని మౌలిక వసతులు, సిబ్బంది సమస్యలపై విద్యాశాఖాధికారులు తనిఖీలు చేయాల్సివున్నా ఆ దిశగా చేయడం లేదు. అధికారులు స్కూళ్లకు వెళ్లి పరిసరాలను పరిశీలించకుండా, సిబ్బంది సమస్యలను తెలుసుకోకుండానే యాజమాన్యాలతో మొక్కుబడిగా మాట్లాడి వెళ్లిపోతున్నారని, ఫిర్యాదుచేస్తే ఉద్యోగం ఊడిపోతుందనే భయంతో తాము మిన్నకుండిపోతున్నామని టీచర్లు చెబుతున్నారు.

నియోజకవర్గ సమాచారం

నియోజకవర్గంలోని మొత్తం పాఠశాలలు	:	317
ప్రైవేట్ పాఠశాలలు	:	216
ప్రభుత్వ పాఠశాలలు	:	101
ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు	:	1.15 లక్షలు
ప్రైవేట్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లు	:	12 వేల మంది

నిబంధనలు పాటించాల్సిందే



ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. టీచర్లకు ఎక్కడైనా ఇబ్బంది ఉన్నట్‌లైతే మాకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదులు అందింతే విచారణ చేసి న్యాయం చేస్తాం.

– చంద్రశేఖర్, డీవైఈఓ, చిత్తూరు

సూర్యప్రభపై శ్రీమన్నారాయణుడి కటాక్షం



సూర్యప్రభ వాహనంపై కొలువైన శ్రీమన్నారాయణుడికి మొక్కుతున్న ఉభయదారులు, భక్తులు

తవణంపల్లె: మండలంలోని టి. పుత్తూరు శ్రీకోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సూర్యప్రభ వాహనంపై శ్రీమన్నారాయణుడు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం ఆలయంలో సీతారామలక్ష్మణులకు అభిషేకం అనంతరం సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించి అర్చనలు, పూజలు చేశారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సుప్రభాతసేవ, తిరుమంజనం, పాలాభిషేకం కార్యక్రమాలకు ఉభయదారులుగా తుకారంరెడ్డి, మునిరత్నం రెడ్డి, పురుషోత్తంరెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. అలాగే సాయంకాలం ఉయ్యాలసేవ నిర్వహించారు. ఉభయదారులు గిరిప్రసాద్‌రెడ్డి కుటుంబసభ్యులు ఈ సేవకు పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధ పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఇక రాత్రి సూర్యప్రభ వాహనసేవకు ఉభయదారులుగా చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వేదపండితులు ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. పురవీధుల్లో స్వామి వారికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళహారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు.



ఉయ్యాలపై సేదతీరుతున్న స్వామివారు

నేడు చంద్రప్రభ వాహన సేవ

వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు, తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఉయ్యాల సేవ, రాత్రి చంద్రప్రభ వాహన సేవ నిర్వహించనున్నట్టు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌కో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించరూ!

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కుప్పంలో సీఎం చంద్రబాబుకు ఆ సంస్థ కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు బుధవారం కోరారు. సంస్థలలో మూడు దశాబ్దాలకు పైబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అరియర్స్, పీఆర్సీ, ఇంక్రిమెంట్లను వెంటనే విడుదల చేయాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగులకు సంబంధించి వారి పిల్లలకు కారుణ్య నియమాకం కింద ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమకుమార్, జిల్లా కోశాధికారి రాజు, మణికంఠ, మదన్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల కోసం ఈ-పోస్ యంత్రాలు



బ్యాంకర్లతో మాట్లాడుతున్న కమిషనర్

-బ్యాంకర్లతో చర్చించిన కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో, వార్డు సచివాలయాల్లో ఆస్తి, ఇతర పన్నుల వసూళ్ల కోసం ఈ-పోస్ యంత్రాలను ప్రవేశపెట్టడంలో భాగంగా కమిషనర్ జె.అరుణ బ్యాంకు అధికారులతో చర్చించారు. బుధవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో ఆమె బ్యాంకర్లతో సమావేశమయ్యారు. నగరపాలక పరిధిలో వివిధ రకాల పన్నుల వసూళ్లను సరళతరం చేయడం, పారదర్శకత పాటించడం కోసం ఈ-పోస్ యంత్రాలను అందించేందుకు తమకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం పన్నులు చెల్లించాలంటే కొంతర్లలో నగదు రూపంలో చెల్లించాల్సి ఉంది. మరింత సులభంగా ప్రజలు పన్నులు చెల్లించేందుకు వీలుగా ఈ-పోస్ యంత్రాలను ప్రవేశపెడితే వివిధ రకాల బ్యాంకు కార్డులు, ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించే అవకాశం లభిస్తుంది. అక్కడికక్కడే రసీదులు అందించవచ్చు. ఇదే సమయంలో పారదర్శకత పెరుగుతుంది. ఈ విధానం అమలు కోసం నగర పరిధిలోని 50 వార్డు సచివాలయాల్లో ఈ-పోస్ యంత్రాలను సమకూర్చాలని బ్యాంకులను కోరారు. సమావేశంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విత్తే ముందు విత్తనశుద్ధి చేయాలి

- వ్యవసాయశాఖ ఏడీ ఉమ



టి.పుత్తూరులో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

తవణంపల్లె: రైతులు వేరుశనగ విత్తే ముందు విత్తనశుద్ధి చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని వ్యవసాయశాఖ ఏడీ ఉమ సూచించారు. బుధవారం మండలంలోని టి.పుత్తూరులో సాగులో ఉన్న వేరుశనగ పంటను, వేరుశనగ విత్తనాలు విత్తడాన్ని ఆమె పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడి సాగు పరంగా తగిన సూచనలు, సలహాలిచ్చారు. రైతులు పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న వేయాలన్నారు. వీటి వల్ల రసం పీల్చే పురుగుల నుంచి పంటను కాపాడువచ్చునని పేర్కొన్నారు. వేరుశనగలో అంతరపంటగా 7 లేక 9 వరుసలకు కంది పంట సాగు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా పురుగులు నియంత్రణ కోసం ఆముదపు గింజలు నాటడం మంచిదన్నారు. ఏడీతో పాటు తవణంపల్లె వ్యవసాయాధికారి ప్రవీణ్, సచివాలయ ఉద్యాన శాఖ అసిస్టెంట్ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు బానిస కారాదు



అవగాహన ర్యాలీలో సెబ్ అధికారులు, విద్యార్థులు

బంగారుపాళెం: యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చిత్తూరు రూరల్ సెబ్ సీఐ హరికృష్ణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం డ్రగ్స్‌పై పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జాతీయ రహదారి మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు అలవాటుపడితే జీవితాలు అర్థాంతరంగా నాశనం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎస్‌ఐ నాగరాజ మాట్లాడుతూ సమాజం అభివృద్ధి యువతరంతోనే సాధ్యమన్నారు. ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటే జీవితం అంతా ప్రశాంతంగా సాగించవచ్చన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ మురళి, సెబ్ హెడ్ కానిస్టేబుల్ సుబ్రమణ్యంగౌడ్, కానిస్టేబుళ్లు కిరణ్, శ్వేత, అధ్యాపకులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయం తనిఖీ

చిత్తూరు అర్బన్: నగరంలోని దొడ్డిపల్లె మూడవ వార్డు సచివాలయాన్ని నగర కమిషనర్ జె.అరుణ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. వార్డు సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సచివాలయ పరిధిలో సమస్యలపై స్థానిక నాయకులు, ప్రజలతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగాలని సూచించారు. 'స్టాప్ డయేరియా ప్రచార' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పక్కగా అమలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. గురువారం అన్ని పాఠశాలల్లో చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, పోస్టర్లు ప్రదర్శించడంతోపాటు మధ్యాహ్న భోజనానికి ముందు విద్యార్థుల చేతుల శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు నళిని, సీఎంఎం గోపి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న కమిషనర్

అంతరపంటలతో అదనపు ఆదాయం



మామిడిలో అంతరపంటగా సాగు చేస్తున్న టమాట





తొప్పనపల్లె వద్ద మిరపలో అరటి, బొప్పాయిలో బంతి సాగు

- మామిడి తోటల్లో ఎక్కువగా అంతరపంటల సాగు
- ఒకే పంట కాలంలో రెండు, మూడు పంటలతో రెట్టింపు ఆదాయం
- తక్కువ భూములున్న రైతులకు లాభదాయకం
- తగ్గనున్న పంట పెట్టుబడి, కూలీల ఖర్చులు



మామిడిలో అంతరపంటగా వంగ

పలమనేరు: సాధారణంగా రైతులు తమ భూమిలో ఒక పంటను మాత్రమే సాగు చేయడం పరిపాటి. కానీ ఏక కాలంలో ఒకే భూమిలో రెండేసి, మూడేసి పంటలను సాగుచేయడం ఇప్పుడు జిల్లాలో ఊపందుకుంటోంది. ఒక పంటలో నష్టం వాటిల్లినా మరోపంట రైతును ఆదుకుంటోంది. ఇది ఒక విధంగా అదనపు ఆదాయంగా మారింది. ఈ కారణంగా అంతర పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటివరకూ కేవలం మామిడి తోటలున్న రైతులు ఏడాదికోసారి తోటను విక్రయించి ఆదాయం పొందుతున్నారు. అయితే రైతులు ఇప్పుడు మామిడి తోటలోనే ఏడాదికి మూడు కాయగూర పంటలను సాగు చేస్తున్నారు. ఫలితంగా మామిడి ఆదాయంతో పాటు అంతకు మూడు రెట్ల ఆదాయాన్ని అంతర పంటలతో పొందుతున్నారు.

మామిడి రైతులకెంతో మేలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి విస్తీర్ణం 2.60 లక్షల ఎకరాలుగా ఉంది. ఇందులో నీటి సౌకర్యం ఉన్న తోటలు 80వేల ఎకరాలు. గత మూడేళ్లుగా మామిడితోటల్లో ఇతర పంటల సాగు క్రమేణా పెరుగుతూ ప్రస్తుతం 40 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగుచేస్తున్నట్లు ఉద్యానవనశాఖ చెబుతోంది. మామిడిలో అంతర పంటలుగా బీన్సు, టమాట, వంగ, బెండ, పసుపు, మిరప..ఇత్యాది వాటిని అంతర పంటలను పండిస్తున్నారు. పప్పుధాన్యాలైన అలసంద, జీలుగ, పెసర, మునగలతో పాటు తక్కువ వ్యవధి పంటలైన ఆకుకూరలను సైతం సాగుచేస్తున్నారు.

సాధారణ పంటల్లో ఇదీ కాంబినేషన్

బొప్పాయిలో బీన్సు, కొత్తిమీర, ధనియాలు, వెల్లుల్లి, మిరపలో అరటి, టమాటలో కాకర, దోస, తీగ బీన్సు, దోస, బీర మొదలైన వాటిని సాగుచేస్తున్నారు. బంతిపూలలో దోస, కొత్తిమీర, బెండ, బీన్సు, టమాట, వంగలో బంతి, టమాటలో కాకర లాంటి కాంబినేషన్లు రైతులకు లాభసాటిగా మారాయి. కొందరు రైతులు బొప్పాయిలో బంతి, మిరపలో అరటి, బంతిలో అలసంద, క్యాబేజీలో వెల్లుల్లి, కొత్తిమీర సాలుపంటగా జొన్నలను పండిస్తున్నారు.

ఈ విధానాలతో బహుళ ప్రయోజనాలు

పంట సాగుకు అవసరమైన భూసారానికి సేంద్రియ ఎరువులు, నీటి వినియోగం, కూలీలు, క్రిమి సంహారక మందుల ఖర్చు తగ్గుతుంది. ముఖ్యంగా పంటకాలం ఆదా అవుతుంది కాబట్టి ఏటా మూడు పంటల్లో రెండు, మూడు పంటలను మిశ్రమ, అంతర పంటలుగా సాగుచేసుకోవచ్చు. దీంతో ఒక పంటకు ధర తగ్గినా మరో రెండు పంటలకు ధరలుండే అవకాశం ఉంటుంది. ఫలితంగా రైతుకు నష్టాలు రావు. అందుకే రైతులు విభిన్నంగా ఆలోచించి మిశ్రమ పంటలవైపు దృష్టి సారించారు.

టమాట రైతులకు ఇదో వరం

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో టమాట ఎక్కువగా సాగవుతోంది. అయితే వీటి ధరలు ఇప్పుడు బాగానే ఉన్నా ఏ సీజన్‌లో ధరలెలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఎకరా పొలంలో టమాట సాగు చేసేందుకు దాదాపు రూ.80వేలు వ్యయం చేయాల్సి ఉంటుంది. పంట దిగుబడి మధ్యలో ఉన్నప్పుడు ఇదే పొలంలో తీగ పంటలైన బీన్సు, బీర, కాకర, సొర లాంటి వాటిని సాగుచేస్తే టమాట పంట ఒడగ్గానే అదే కర్రలకు రెండో పంట తీగలను పెట్టుకోవచ్చు. ఫలితంగా పంట పెట్టుబడి తగ్గడంతో పాటు భూమిని కొత్త పంటకు సిద్ధం చేసే ఖర్చు కూడా తగ్గుతుంది. టమాట పంటలో ధర లేనప్పుడు నష్టాన్ని చూసే రైతులకు రెండో పంట ఆసరా ఉంటుంది.

మారిన రైతుల ఆలోచన సరళి



అంతర పంటలుగా కూరగాయలు, పూలు.. ఇలా వేటినైనా భూమిలో అదే సత్తువతో సాగు చేయవచ్చు. ప్రత్యేకించి అధికంగా ఎరువులు వేయాల్సిన అవసరం లేదు. రెండు, మూడు రకాల పంటలున్నపుడు రైతులను ఏదో ఒక పంట ఆదుకుంటుంది. అన్నిటితో అధికంగా ఆదాయం కళ్లజూసినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. తక్కువ ఖర్చుతో సాగు చేస్తూ నాలుగురకాల ఆదాయాన్ని పొందవచ్చు. ఇప్పుడు రైతులు ఆలోచన సరళి మారింది.

–డాక్టర్ అన్నపూర్ణదేవి, ఏడీ, అగ్రికల్చర్, పలమనేరు

మహిళలపై వీధికుక్కల దాడి

పుంగనూరు: వీధికుక్కల దాడిలో ఇద్దరు మహిళలు గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు..పట్టణానికి చెందిన కనకమ్మ(60), యశోదమ్మ(67) పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద జగనన్న కాలనీలలో ఇంటి కూలీ పనులకు వెళ్లారు. పనులు చేస్తుండగా వీధి కుక్కలు వచ్చి వారిపై దాడిచేసి కరవడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'వర్గీకరణ'కు మద్దతుపై హర్షం

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ప్రకటించడం ఆనందదాయకమని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు నరేంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఎంఎస్‌పీ నాయకులు మాటూరి మురళి, నరసింహులు, నాగభూషణంతో కలసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. నరేంద్రబాబు మాట్లాడుతూ, ఎంతోకాలంగా ఎస్సీ వర్గీకరణ అంశంపై పోరాటం చేస్తున్నామని, ఇకనైనా న్యాయం చేసి బడుగులకు మేలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు వెంకట్రమణ, సదుం వెంకట్రమణ, ప్రభాకర్, చౌడేపల్లి ప్రభాకర్, హరిబాబు, గోవిందు, రవి, హరి, పులిచెర్ల హరిబాబు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ

బైరెడ్డిపల్లె: మండలంలోని ప్రైవేటు పాఠశాలలను బుధవారం డీవైఈఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల తరగతి గదులు, విద్యార్థుల హాజరు సంఖ్య, టాయిలెట్స్ నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. విద్యాబోధనలో ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా విద్యాబోధన చేయాలన్నారు.